

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

28 జనవరి 2026 పేజీలు : 08 బుధవారం




# సింహపురి గర్జన



## వీఆర్‌సీ నుండి గాంధీ బొమ్మ వరకు ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ

### యువ గళం

- మంత్రి నారాయణ పిలుపుతో నెల్లూరులో 'యువగళం' జన ప్రభంజనం
- మంత్రి నారాయణ టెలి కాన్ఫరెన్స్.. నెల్లూరులో ర్యాలీకి రికార్డుస్థాయి జనసందోహం
- నారా లోకేష్ అడుగుజాడల్లో.. యువగళానికి నీరాజనం పట్టిన నెల్లూరు నగరం
- ఒక్క కాల్‌తో కదిలిన వేలాది మంది కార్యకర్తలు - నారాయణ నాయకత్వానికి నిదర్శనం




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

రాజకీయాల్లో వ్యూహకర్తగా, అభివృద్ధిలో అపర భగీరథుడిగా పేరుగాంచిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సత్తా ఏంటో నెల్లూరు నగరం మరోసారి కళ్లారా చూసింది. యువనేత నారా లోకేష్ చారిత్రాత్మక 'యువగళం' పాదయాత్ర నేటికి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. నెల్లూరు సిటీలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ ఒక మహా ప్రవాహంలా సాగింది. మంత్రి నారాయణకి ప్రజల్లో ఉన్న క్రేజ్.. కార్యకర్తల్లో ఉన్న పట్టుకు ఈ ర్యాలీ ఒక సజీవ సాక్ష్యం. ఎటువంటి భారీ హంగులు లేకుండా, కేవలం మంత్రి చేసిన ఒక్క టెలి కాన్ఫరెన్స్ పిలుపుతో నెల్లూరు వీధులన్నీ పసుపుమయమయ్యాయి. వేలాది మంది ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి వీఆర్సీ సెంటర్ నుండి గాంధీ బొమ్మ వరకు బారులు తీరారు. ఇది కేవలం విజయోత్సవ ర్యాలీ మాత్రమే కాదు.. మంత్రి నారాయణ నాయకత్వం పట్ల నెల్లూరు ప్రజలకున్న అచంచలమైన నమ్మకం. మంత్రి ఆదేశాల మేరకు ఇంచార్జ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ అట్టహాసంగా సాగింది.

**యువగళం.. మూడేళ్లు : లోకేష్ ప్రస్థానం**

సరిగ్గా మూడేళ్ల క్రితం కుప్పం గడ్డపై ప్రారంభమైన 'యువగళం' పాదయాత్ర, నేడు రాష్ట్ర భవిష్యత్తును మార్చే దిక్సూచిగా మారింది. 226 రోజుల పాటు 11 ఉమ్మడి జిల్లాలు.. 2,097 గ్రామాల మీదుగా సాగిన 3,132 కిలోమీటర్ల యాత్ర. నాడు లోకేష్ వేసిన ప్రతి అడుగు ఒక ఓటుగా మారి.. 2024 ఎన్నికల్లో కూటమికి 164 సీట్ల ప్రభంజనాన్ని అందించింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు.. నేడు మంత్రిగా గూగుల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలను రాష్ట్రానికి రప్పిస్తూ లోకేష్ యువతకు ఆశాకిరణంగా నిలిచారు.

**అభివృద్ధి సారథులు.. లోకేష్ విజన్ - నారాయణ కార్యాచరణ**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌ను పుణికిపుచ్చుకున్న యువనేత నారా లోకేష్ వేగం.. దానికి మంత్రి నారాయణ పక్కా కార్యాచరణ తోడవ్వడంతో

-మిగతా 2లో

# ఆంధ్రప్రదేశ్ ఆశాకిరణం యువనేత నారా లోకేష్



యువగళం మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ ర్యాలీలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

- 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు పాదయాత్ర ఫలితమే 2024 ఎన్నికల్లో 164 సీట్లు
- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు రాష్ట్రానికి గూగుల్, టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు తెస్తూ.. అభివృద్ధి
- ఒకేరోజు 27 కోట్లతో 240 పనులకు శంకుస్థాపనలు చేసి అన్నను మించిన తమ్ముడు అనిపించుకున్నారు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

యువనేత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువగళం.. ప్రజాగళం ర్యాలీకి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. స్థానిక సర్వోదయ కళాశాల దగ్గర నుంచి మద్రాస్ బస్టాండ్ కూరగాయల మార్కెట్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా టిడిపి

## స్మార్ట్ మీటర్లపై అపోహలు తొలగించాలి

- మంత్రి గొట్టిపాటి రవి కుమార్
- పీఎం సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి



వివరాలు 2లో

# స్మార్ట్ మీటర్లపై అపోహలు తొలగించాలి

- మంత్రి గొట్టిపాటి రవి కుమార్
- ఆర్డీఎస్ఎస్ పనులలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించాలి
- పీఎం సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- స్మార్ట్ మీటర్లపై ప్రజలకు సరైన సమాచారం అందించి అపోహలను తొలగించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ ఉద్యోగులదే..
- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి
- భవిష్యత్తులో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి విద్యుత్ కొరత లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోండి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలతో కలిసి ఆయన జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న వివిధ విద్యుత్ ప్రాజెక్టులు మరియు ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతి అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను మరింత వేగవంతం చేసి మార్చినాటికి అన్ని పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పనులలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం సూర్యఘర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత విద్యుత్ ఉద్యోగులపై ఉందని మంత్రి గొట్టిపాటి గారు స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లపై ప్రజలకు సరైన సమాచారం అందించి వారిలో నమ్మకాన్ని కలిగించాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి విద్యుత్ కొరత లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులను కోరారు. వినియోగదారులకు వంద శాతం సంతృప్తి కలిగేలా విద్యుత్ శాఖ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బందిని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, టీడీపీ రాష్ట కార్య నిర్వాహక కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డిలతో పాటు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సింహపురి గర్జన



(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు సిటీ అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఈ ర్యాలీలో కార్యకర్తలు 'సింహపురి సింహం నారాయణ' అంటూ నినదిస్తూ, ఆయన వెంటే తామంతా ఉంటామని ఎలుగెత్తి చాటిచెప్పారు. ఈ భారీ జనసందోహం ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ, వచ్చే కాలం మనదేనని బలమైన సంకేతం ఇచ్చింది.

నారా లోకేష్ చేపట్టిన చారిత్రాత్మక 'యువగళం' పాదయాత్ర ప్రారంభమై మూడు ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించాయి. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 2023 జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకువచ్చిందని, 426 రోజుల పాటు 97 నియోజకవర్గాల్లో లోకేష్ సాగించిన ప్రయాణం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచిందని కొనియాడారు. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా రూ.200 కోట్లతో మున్సిపల్ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడం, మైనారిటీ విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మాణం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. లోకేష్ బాబు స్ఫూర్తితో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, రాబోయే రోజుల్లో నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని రూప్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఆశాకిరణం.. మంత్రి యువనేత లోకేష్



(మొదటి పేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలు నాడు చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ.. ప్రస్తుత ప్రభుత్వానికి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో జనవరి 27వ తేదీ ఒక అద్భుతమైన రోజుగా అభివర్ణించారు. యువ నాయకులు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర భవిష్యత్తును తిరగరాసేలా యువగళం పాదయాత్ర చేశారని కొనియాడారు. గత ప్రభుత్వం పెట్టిన అవాంతారాలకు ఎదురొడ్డి 3,132 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర చేసి మంత్రి లోకేష్ చరిత్ర సృష్టించారన్నారు. 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు పాదయాత్ర ఫలితమే 2024 ఎన్నికల్లో టిడిపి 164 సీట్లలో విజయకేతనం ఎగురవేసేందుకు దోహదపడిందన్నారు. ఓవైపు విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు మరోవైపు ఐటి మంత్రిగా రాష్ట్రానికి గూగుల్, టిసిఎస్. ఇన్ఫోసిస్, వంటి కంపెనీలు తెస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్టాన్ని యువనేత లోకేష్ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని కొనియాడారు. సీఎం చం ద్రబాబుని మించిన నాయకుడిగా నారా లోకేష్ ఎదుగుతారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జి హోదాలో ఒకేరోజు 27 కోట్లతో 240 పనులకు శంకుస్థాపనలు చేసి అన్నాను మించిన తమ్ముడు అనిపించుకున్నారని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని ప్రశంసించారు.

అనంతరం ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, రూరల్ నియోజకవర్గ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు యువనేత లోకేష్ లోకేష్ నాయకత్వ లక్షణాలను కొనియాడారు. మంత్రి లోకేష్ పరిణితి చెందిన రాజకీయ వేత్త రాటుదేలారని ఓవైపు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలను ఆకర్షించడం లాంటి కార్యక్రమాలు చేస్తూనే ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు చేస్తుంటే లోకేష్ సిఎం చంద్రబాబు నాయుడుని మించిపోయేలా ఉన్నారని ప్రశంసించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర భారతదేశ రాజకీయాలలో ఓ పెను సంచలనమని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి సోదరులు భారీ స్వాగతం చిరస్మరణీయమని, అదే ఉత్సాహంతో యువగళం పాదయాత్ర విజయనగరం ముగింపు వరకు సాగిందన్నారు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకి ఒక గేమ్‌చేంజర్ అని, యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలని సమూలంగా మార్చిందని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

నెల్లూరు ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నెల్లూరు అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర క్షమించదని, ప్రతిపక్ష పార్టీ డ్రామాలు మాని వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. మీ కాలేజీల ముందు బంకులు పెడితే ఊరుకుంటారా..



అంటూ వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మేయర్ రూప్ కుమార్ యాదవ్ సూటి ప్రశ్నించారు. బంకుల యజమానులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తారా.. అంటూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నెల్లూరు నగరాన్ని ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మేయర్ రూప్ కుమార్ యాదవ్ వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం నాయకులు బీదా రవిచంద్ర, ఉపరితల జల రవాణా కార్పొరేషన్ ఛైర్మన్ జెడ్.శివప్రసాద్, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, కేతంరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి : ఎంపీపీ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ పనులను చేపట్టాలని ఎంపీపీ బి.పద్మజా రెడ్డి పేర్కొన్నారు మంగళవారం ఏఎస్ పేట లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పద్మజా రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో దోమలు అధికంగా ఉన్నాయని ఫాగింగ్ నిర్వహించాలని పలు సూచనలు చేశారు ఇరిగేషన్ ఏఈ ఆనంద్ మాట్లాడుతూ.. మండలంలో ఎఫ్ఆర్ ద్వారా 23 పనులకు కోటి 27 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈ షేక్ ఖాదర్ మస్తాన్ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు తదితర పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు పీహెచ్సీ వైద్యాధికారులు మాట్లాడుతూ.. చంద్రన్న సంచార చికిత్స ద్వారా గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వపరంగా ఆరోగ్య సేవలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు అలాగే వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం చేపట్టే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నూతన భవనానికి గెస్ట్ హౌస్ నిర్మాణానికి ఏఎస్ పేటలో డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి తదితర పనులకు సంబంధించి సమావేశంలో చదివి వినిపించారు. ఈ మేరకు ఆమోదం తెలియజేస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి డిప్యూటీ తాహసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంఈఓ జ్యోతి డాక్టర్లు జ్యోతి రాణి ఆయేషా సుల్తానా ఐసిడిఎస్ సూపర్వైజర్లు కస్తూరి శ్రీదేవి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం, ఈసీ రవి వివిధ శాఖల అధికారులు ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని వెంకటగిరి రాజా మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత శాస్త్ర ఎగ్జిబిషన్‌లో ఇటీవల ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రశంస పత్రాలు అందజేశారు. గత నెల 22వ తేదీ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా డిసెంబరు 22న జాతీయ గణిత దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఎగ్జిబిషన్ నునగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ సందర్శించి విద్యార్థులు ఏర్పాటుచేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను చూసి ప్రశంసించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే వీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గణిత శాస్త్రం పై ఎగ్జిబిషన్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా గణితంపై విద్యార్థుల్లో దాగి ఉన్న భయాలను దూరం చేయడం తోపాటు ఆసక్తిని, అవగాహనను పెంపొందించాలన్నదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉప ప్రధానోపాధ్యాయులు టి.లక్ష్మీనారాయణ, మేథ మాటిక్స్ నిపుణులు యడవల్లి మాధవరావు, ఏ.రాధాకృష్ణయ్య, రమేష్ లు గణిత శాస్త్రం యొక్క ఆవశ్యకతపై క్షుణ్ణంగా విద్యార్థులకు వివరించారు. అనంతరం మేథమేటిక్స్ ఎగ్జిబిషన్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

# మృతుల కుటుంబానికి బీజేపీ ఆర్థికసాయం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన మేకల గణేష్, తలుపుల రమేష్ రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించిన విషయం విధితమే. ఈ మేరకు విషయం తెలుసుకున్న బిజెపి మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మూలే బాలకృష్ణారెడ్డి బాధిత రెండు కుటుంబాలను పరామర్శించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బీజేపీ తరుపున ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు నగదు, 1బస్తా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు బిజెపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల సీనియర్ నాయకులు బొద్దు శివారెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోనేపల్లి అరుణారెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంకె కొండల రావు, కార్యదర్శి వెంకట కొండయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షులు కర్నాటి ఆదినారాయణ్ నాయుడు, బీసీ మోర్చా జానాపురం రత్నయ్య, మైనారిటీ మోర్చా అధ్యక్షులు గుడిమెట్ల రసూల్, ఎస్టీ అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి లీలమ్మ, మహిళ మోర్చా అధ్యక్షులు ఆదిరెడ్డి కల్పనా, యువ మోర్చా నాయకులు రావెళ్ల హరీష్ నాయుడు, కన్స్యూమర్ రైట్స్ హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ యాక్ట్ ప్రొటెక్షన్ ఫోరమ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ బత్తల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అకస్మాత్ తనిఖీలు నిర్వహించిన ఎంపీడీఓ

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని సైదాపురం 1, 2 స్వర్ణ గ్రామ సచివాలయం సైదాపురం, రామ సాగరం, సచివాలయాలలో మండలం ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి అకస్మాత్ తనిఖీలు చేశారు. సచివాలయం సిబ్బంది టైం టు టైం డ్యూటీకి వస్తున్నారా లేదా అని తనిఖీ చేయడం జరిగింది. అంతేకాకుండా యూనిఫైడ్ ఫ్యామిలీ బెనిఫిట్ సర్వే, సిటిజెన్, ఈ కేవైసీ సర్వే, ఇతర సర్వేల గురించి ఎంతవరకు పని చేశారన్న విషయాలపై చర్చించి మిగతా బ్యాలెన్స్ ఉన్నటువంటి వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి తెలిపారు అనంతరంఆయన సచివాలయంలోని రికార్డులు అన్నీ కూడా పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాపురం పంచాయతీ సెక్రెటరీ ఇంద్రాణి 1, 2 సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాలు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక బాపూజీ నగర్‌లో ఉన్నకోరిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చాలా సమస్యల నుండి కావలి పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు పేద గిరిజనుల మధ్య నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కావలి గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద గిరిజనులు, చదువుకొని నిరుద్యోగిగా ఉన్నవారు, మహిళలకు ఉచితంగా టైలరింగ్, కంప్యూటర్ టీవీ, రేడియో, సెల్ఫోన్ రిపేరింగ్‌లో మంచి ప్రతిభ కలిగిన నైపుణ్యత కలిగిన అధ్యాపకులచే శిక్షణను ఇవ్వడం జరిగిందని కోరిడ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ రావేల జైపాల్ తెలిపారు. నిరుపేదలకు గిరిజనుల కుటుంబంలో పుట్టి వారి జీవనఉపాధి కోసం కోరిడ్సంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమాలు ఉచిత ఉపాధి శిక్షణను కల్పిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరిడ్ సంస్థ సూపర్వైజర్ సునీల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్లో యాన్యువల్ డే సెలబ్రేషన్స్



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ నందు యాన్యువల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మొదట విద్యార్థులు అందరూ కూడా సరస్వతి పూజ నిర్వహించి పూజ అనంతరం ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే వేదిక నిర్వహించడం జరిగిందని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నాటకాలు నృత్యాలు ఆటలు పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి బహుమతులు ఇవ్వడం జరిగిందని ఈ వేడుకల్లో పిల్లలు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కుంచం నీరజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సీనియర్ ఉపాధ్యాయులు వాసుదేవ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వసూలు చేయండి : డిప్యూటీ ఎంపీడీఓ

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఏఎస్ పేట డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం పేర్కొన్నారు మంగళవారం ఏఎస్పేట ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని డిప్యూటీ ఎంపీడీఓ ఎన్.మునిరత్నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్ను 50శాతం వసూలు చేయాలని అన్ని పంచాయతీల కార్యదర్శులకు మేమోలు జారీ చేయడమైనది అన్ని గ్రామాలలో ఫిబ్రవరి 15 నాటికి నూటికి నూరు శాతము ఇంటి పన్ను వసూలు చేయాలని అందుకు గ్రామ ప్రజలందరూ సహకరించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయవలసిందిగా తెలియజేశారు.

## అప్పలరాజు అరెస్టు దారుణం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అనకాపల్లి జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజు అరెస్టు చేయడం దారుణమని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యంపై జరుగుతున్న ఆందోళనలో పాల్గొంటున్న అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం సిగ్గుచేటన్నారు. కనీసం జైలులో ములాఖత్ కూడా లేకుండా చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. నిత్యం ప్రజాసేవలో మమేకమవుతున్న అప్పలరాజును అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని, ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్ భాషా, కామాక్షమ్మ, నాగేశ్వరరావు, నాయబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి యూరియా పంపిణీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో బుధవారం నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని సొసైటీ సీఈవో రేకలగుంట పోలయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరాలోపు రైతులకు ఒకటి, అంతకుమించి విస్తీర్ణం ఉంటే రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో రావాలని ఆయన సూచించారు.

# యువగళం విజయోత్సవ ర్యాలీ

## టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి






**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** యువగళం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం టిడిపి సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో పొదలకూరు మండలంలో యువగళం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత పొదలకూరు నుంచి తాటిపర్తి, మహ్మదాపురం మీదుగా విరువూరు వరకు మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. అనంతరం విరువూరులో సచివాలయం నుంచి హైస్కూలు వరకు యువగళం స్ఫూర్తితో పాదయాత్ర జరిపారు. ఈ ర్యాలీలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. 3132 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర స్ఫూర్తితో సర్వేపల్లిలో 3132 సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న యువనేత, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యువగళం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విరువూరు జెడ్పీ హైస్కూలులో 22 మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశామని వివరించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవమైన మార్చి 29వ తేదీ నాటికి 3132 సైకిళ్ల పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు పట్టణాధ్యాక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి పల్లవరపు కృష్ణ,టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణ, పీఏసీఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ అక్కెం సుధాకర్ రెడ్డి, యెద్దల అజయ్ రెడ్డి, డేగా రవిరాఘవేంద్ర, కొల్లి రాజా రెడ్డి, ఆదాల మురళీ రెడ్డి, కలగట్ల సందీప్, విరువూరు గ్రామ సర్పంచ్ జగన్ మోహన్, దాసినేటి అనిల్ కుమార్, గొట్టిగుండాల రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ మెడికల్ కాలేజ్‌లో రహదారి భద్రతపై అవగాహన




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా నెల్లూరు రవాణా శాఖ, నారాయణ మెడికల్ కాలేజి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా రోడ్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని, వేగం కన్నా ప్రాణం చాలా విలువైనదని, ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం తోపాటు సమాజానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని, ముఖ్యంగా యువత దీని గురించి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం బాల మురళీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మోటారు వెహికల్స్, నెల్లూరు మాట్లాడుతూ.. జనవరి 16వ తేది నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు జాతీయ భద్రతా మాసోత్సవాలను జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా గుడ్ సమరిటన్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ట్రాఫిక్ నియమ నిబంధనలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు 108కి సమాచారం అందించి, ఆ వ్యక్తిని గంటలోపు హాస్పిటల్ కు చేర్చడం ద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సమాచారం అందించి సహాయం చేసిన వారికి పోలీసు కేసులకు సంబంధించిన ఇబ్బందులు గానీ, హాస్పిటల్ వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదని తెలిపారు. రోడ్డు భద్రతకు సంబంధించిన విషయాలను పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పూర్ణ చంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మైనర్స్కి వెహికల్ ఇవ్వడం, త్రాగి డ్రైవింగ్ చేయడంకు విధిస్తున్న జరిమానాల గురించి, చట్ట పరమైన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నారాయణ మెడిలక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డీఎం కార్తీక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎం.స్వప్నిల్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, నారాయణ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, ఏజీఎం ఎసి శేఖర్ రెడ్డి, ఎఓ సందేష్ రైకర్, ఇంకా సుమారు 500 మందికి పైగా వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో ఆంగ్ల బోధనపై జాతీయ సదస్సు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'ఆంగ్ల భాష, సాహిత్య బోధనలో ఇటీవలి ధోరణులు' (రీసెంట్ ట్రెండ్స్ ఇన్ టీచింగ్ ఇంగ్లీష్ అండ్ లిటరేచర్) అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రధాన్ మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పిఎం-ఉష) నిధుల సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య వీవీఎన్ రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా, విక్రమ సింహపురి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత గౌరవ అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య వీవీఎన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఆంగ్ల సాహిత్యం ద్వారా విద్యార్థులకు సామాజిక-సాంస్కృతిక విలువలను అందించవచ్చని, డిజిటల్ సాధనాల వినియోగంతో బోధన మరింత ప్రభావవంతంగా మారుతుందని తెలిపారు. డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. గ్లోబలైజేషన్ యుగంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఎంతో అవసరమని, అధ్యాపకులు ఆధునిక బోధనా పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. సదస్సులో భాగంగా బీఓఎస్ చైర్ పర్సన్ ఆచార్య వైఎస్ శారద సదస్సు లక్ష్యాలు, అవసరాలను వివరించారు. ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ ఐజాక్ 'పరిశోధన ఆధారిత బోధన' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, సదస్సు సమన్వయకర్త డాక్టర్ రాజోలు ప్రభాకర్, విభాగాధిపతి డాక్టర్ శ్యామ్ సుందర్ భగవాన్ బోడవుల, అధ్యాపకులు డాక్టర్ బి.శామ్యూల్ మార్క్స్, వి.భాగ్యజ్యోత్స్న, టి.పాల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ కార్యదర్శులకు క్రీడలు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక క్రీడోత్సవాలు -2026లో భాగంగా 'సింహపురి గ్రామ వార్డు సచివాలయాల జాయింట్ యాక్షన్ కమిటీ' ఆధ్వర్యంలో స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఈనెల 28, 29 తేదీలలో సచివాలయ వార్డు కార్యదర్శులకు వివిధ విభాగాలలో క్రీడలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వైఓ నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మహిళల విభాగంలో త్రో బాల్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, కబడ్డీ, 100 మీటర్స్ రన్నింగ్ రేస్, లాంగ్ జంప్, షాట్ పుట్, చెస్ క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పురుషుల విభాగంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, 100 మీటర్స్ రన్నింగ్ రేస్, 400 మీటర్స్ రన్నింగ్ రేస్, లాంగ్ జంప్, షాట్ పుట్ క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జెఏసి నిర్వాహకులు దారా సురేష్ బాబు 63058 78722, భాను ప్రకాష్ 89775 79060లను సంప్రదించి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే క్రీడలలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.

## పార్కులో వసతులు కల్పించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 3వ డివిజన్ కిసాన్ నగర్ ప్రాంతంలోని ఎన్టీఆర్ పార్కును మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పార్కులోని వసతులు, పచ్చదనం, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్లు తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా పార్కు ప్రాంతంలో విష సర్పాలు సంచరిస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు శానిటేషన్ చర్యలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పార్కు సమీపంలోని ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ అనిల్ కుమార్, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాప్ స్టేడియంలో ముగిసిన పోటీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం స్థానిక శాప్ స్టేడియంలో కావలి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ 2 పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ కార్యక్రమాన్ని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మ్యాచ్ నిరీక్షించారు. ఫైనల్‌లో ఇరు జట్లు మధ్య ఉత్కంట భరితంగా సాగింది. క్రీడా అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఈ క్రీడను వీక్షించారు అనంతరం విజేతలుగా నిలిచిన చెట్లకు ఎమ్మెల్యే కావ్య చేతుల మీదుగా ట్రోఫీలు నగదు బహుమతులను అందజేశారు. గెలుపు పొందిన జట్టును క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా టోర్నమెంట్లో నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించాలని తెలిపారు. టోర్నమెంట్లో ప్రథమ బహుమతి లక్ష రూపాయలు ద్వితీయ బహుమతి 50వేల రూపాయలు తృతీయ బహుమతి 25వేల రూపాయలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 5000 బెస్ట్ బౌలర్కు 2500 నగదును అందజేశారు. కావలిలో యువతను క్రీడలు వైపు మరింత ఆకర్షిస్తాయని యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# దోమల నివారణ చర్యలు చేపట్టాలని వినూత్న రీతిలో నిరసన

- దోమ తెరలు, దోమల బ్యాట్ లతో వినూత్న రీతిలో సీపీఎం నిరసన
- గాంధీ బొమ్మ సెంటర్ నుండి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ, ధర్నా
- నెల్లూరు స్మార్ట్ సిటీ కాదు మస్కిటో సిటీగా మారిపోయింది.. సింహపురిని దోమలపురిగా పాలకులు మార్చేశారు
- యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ చర్యలు చేపట్టాలి
- చిత్తశుద్ధితో చేపడితే దోమల నివారణ సాధ్యం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ నుండి విఆర్‌సి సెంటర్ వరకు దోమతెరలు, దోమల బ్యాట్లు,కడ్డీలతో వినూత్న రీతిలో నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు సిపిఎం చేపట్టిన నిరసనను ఆసక్తిగా తిలకించారు. దోమల తీవ్రతపై ప్రజలు చర్చించుకున్నారు. దోమల బారి నుండి నెల్లూరు నగర ప్రజలను కాపాడాలని దోమల బాబోయ్ దోమలు అంటూ పెద్ద ఎత్తున ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. దోమల నివారణ పేరుతో కార్పొరేషన్‌లో కోట్ల రూపాయల నిధులు ఖర్చు పెడుతున్నారని కానీ దోమలు మాత్రం నగరంలో స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు.దోమల తీవ్రత వల్ల డెంగ్యూ చికెన్ గునియా మలేరియా లాంటి అనేక విషరాల బారినపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక మంది ప్రాణాలు కూడా కోల్పోయారని అన్నారు. పాలకులు అధికారుల వైఫల్యం వల్లే ప్రజలకు ఈ పరిస్థితి ఏర్పడినదని అన్నారు నిధులు పక్కదారి మళ్లించి స్వాహా చేస్తున్నారని అన్నారు. ట్రాక్టర్ల పేరుతో కోట్ల రూపాయల దుర్వినియోగం జరుగుతున్నదని అన్నారు. ఆయిల్ బాల్స్ వేయడం, బేటెక్స్ ఆయిల్ స్ప్రే చేయడం, ఫాగింగ్ క్రమ పద్ధతిలో చేయడం లాంటివి చేపడితే దోమల నివారణ సులభంగా చేయవచ్చని అన్నారు. ప్రచార ఆర్భాటాల కోసం తూతూ మంత్రంగా చేస్తున్నారే తప్ప దోమల నివారణ చర్యలు సరిగా లేవని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రజల ఆరోగ్యాలు ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు నెల్లూరుని స్మార్ట్ సిటీ అంటున్నారని మస్కిటో సిటీగా మారిపోతున్నదని అన్నారు పాలకుల వైఫల్యం వల్ల సింహపురి కాస్త దోమలపురిగా మార్చేశారని అన్నారు తక్షణమే తీరు మార్చుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు, పి.సూర్య నారాయణ కాయంబు శ్రీనివాసులు నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, కత్తి పద్మ, సుబ్బమ్మ, మూలం ప్రసాద్, రషీద్, ఏమేలు అల్లంపాటి శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, జాఫర్, ఫయాజ్, ఆవుల పెంచలయ్య సిపిఎం పార్టీ కార్యకర్తలు ప్రజా సంఘాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## పీవీ రాఘవేంద్రను అభినందించిన సిబ్బంది



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని జోగిపల్లి పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పివీ రాఘవేంద్రబాబుకు తన సేవలకు అభినందించి జిల్లా స్థాయిలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీద ప్రశంస పత్రం పొందిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు కార్యాలయ సిబ్బంది పీవీ రాఘవేంద్రను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీ మోహన్‌రెడ్డి ఏవో మురళీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవోలు ఐ.శ్రీనివాసరావు, ఎ.వెంకటరమణయ్య, మండల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి : డిప్యూటి డీఈఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు ఇష్టపడి ఆసక్తితతో శ్రద్ధాసక్తులతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఆత్మకూరు డిప్యూటి డీఈఓ వి.జానకిరామ్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయిని సి.హెచ్.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా జానకిరామ్ అతిథిగా హాజరయ్యారు. జానకిరామ్ మాట్లాడుతూ.. పదవతరగతి విద్యార్థులు మరింత శ్రద్ధగా చదివి మంచిమార్కులు సాధించాలని, స్కూలుకు మంచిపేరు తేవాలని, తల్లిదండ్రులకు సంతోషం కల్గించాలని ఆయన సూచించారు. విద్యార్తులు సులువుగా ఎలా చదవాలి, ఎలా మంచి మార్కులు సాధించాలనే మెళుకువలను ఆయన వివరించారు. క్రమశిక్షణతో అభ్యశిస్తే ఉజ్వల భవిష్యత్తు పొందగలరని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఘనచరిత్ర ఉందని, ఎందరెందరో ఇక్కడ చదివి దేశవిదేశాల్లో రానిస్తున్నారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచినవారికి జానకిరామ్ బహుమతీప్రధానంగా గావించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రికసమ్మె నోటీసు అందజేసిన ఆశాకార్యకర్తలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి12వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని ఆత్మకూరు మండలం మహిమలూరు ప్రాధమిక ఆరోగ్యంకేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు నిర్ణయించారు. ఈమేరకు యూనియన్ నాయకులు, ఆశా కార్యకర్తలు మహిమలూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దేవానంద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా వారు ప్రసంగిస్తూ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి12వతేదీ దేశవ్యాపిత సమ్మెలో తాము కూడా పాల్గొంటామన్నారు. లేబర్‌కోడ్స్‌రద్దుపరచాలని, కనీసవేతనం 26వేలుగా నిర్ణయించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం ఈసమ్మె చేయనున్నామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆశావర్కర్స్‌యూనియన్ నాయకులు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ పిలకు సామర్థ్యాల పెంపు పై శిక్షణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ వారి ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరం నందు నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మెప్మా ఆర్‌పిలకు ఒకరోజు సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారు నియమించిన నాలెడ్జ్ పార్ట్నర్స్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారిచే మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వార్డు సచివాలయాల అడిషనల్ కమీషనర్ హిమబిందు మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘం నందు ఎంతో కీలకమైనదని, వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుండి సంపద పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిధులు నగర టిపిఆర్ఓ వాసు బాబు, డిప్యూటీ డైరెక్టర్ జి.మాధురి. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం.కనకాద్రి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లీలా రాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దాలంటే, అందరూ చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బంది వారు వచ్చినప్పుడు వారికి అందించాలని, స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యత వహిస్తే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దవచ్చునని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ తడి పొడి హానికర ప్లాస్టిక్ వేస్ట్, ఈ - వేస్ట్ నిర్వహణ గురించి విరివిగా అవగాహన కల్పించి, వార్డులో ఏ విధంగా నిర్వహించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఎస్‌డబ్ల్యూ బల్క్ వేస్ట్ జనరేటర్స్ వేస్ట్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఎంఎస్‌డబ్ల్యూ రూల్స్ 2016 తదితర విషయాల పైన శిక్షణ అందించారు. అలాగే స్వచ్ సర్వేక్షన్ ర్యాంకింగ్‌కు ఎలాంటి పద్ధతులు పాటించాలనే అంశాలు తెలియజేసారు. ప్రజలలో మార్పు రావాలంటే ముందుగా మన ప్రవర్తనలో మార్పు రావాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుండి రిసోర్స్ పర్సన్స్‌గా తిరుపతి రావు, జయమాధురిమ ఇందులో పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఓలు, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ మంత్రికి ఉద్యోగాలు ఇప్పించమని వినతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలో ఉన్నటువంటి ఏపీ జెన్కో ఎస్‌టిఎస్‌టిపిఎస్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పించమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు నాలుగు గ్రామాల నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీరెడ్డి సమక్షంలో వినతి పత్రం అందజేసాము అన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం నేలటూరు గ్రామ నిర్వాసితులు భూమి, ఇల్లు కోల్పోయి ఏపీ జెన్కో థర్మల్ పవర్ స్టేషన్‌కు నిర్మాణానికి దోహదపడ్డారు. అప్పట్లో భూములు ఇల్లు కోల్పోయినటువంటి భూ నిర్వాసితులకు ఎప్పటినుంచో పర్మినెంట్గా ఉద్యోగం ఇస్తామని మాటలతోనే సర్ది చెబుతూ అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. తదనంతరం 438 జీవో నెంబర్ ప్రకారం భూమి, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు 350, ఎల్ఈడి పోస్టులు 2013 సంవత్సరంలో సాంక్షన్ చేయడం జరిగింది కానీ ఆ పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేసి జీవోలను రద్దు చేసి పర్మినెంట్గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి నేటి వరకు పర్మినెంట్గా ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని నేలటూరు, నేలటూరు పాలెం ముసునూరు వారి పాలెం, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితులు మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో భూమి, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి ఉద్యోగ అవకాశాలు కల్పించి పెర్మనెంట్ చేయమని వినతిపత్రం ద్వారా విద్యుత్తు శాఖ మంత్రిని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ మానవత్వం

**● చలి తీవ్రత దృష్ట్యా.. పారిశుద్ధ కార్మికులకు మంకీ టోపీలు అందజేత ● ప్రభుత్వ చొరవతో ఉన్ని దుస్తులు అందజేయాలని విజ్ఞప్తి**



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సామాజిక, మానవీయ, పరోపకార సేవా కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ కోరుకుంటున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ సభ్యులు మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు చలి తీవ్రతను తట్టుకునేందుకు అవసరమైన మంకీ టోపీలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య యాదవ్ మాట్లాడుతూ.. భగవంతుడు ప్రసాదించిన మానవ జన్మ సార్థకం చేసుకునేందుకు 'ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న' అన్న నినాదంతో కూడిన పరోపకార సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఉత్తమమన్నారు. ప్రస్తుత సీజన్లో ఎముకలు కొరుకుతున్న చలి తీవ్రతను పంటి బిగువున భరిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా పారిశుధ్యం తొలగిస్తున్న కార్మికుల అవస్థలను గుర్తించి సేవా కమిటీ సభ్యుల సహకారంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే మంకీ టోపీల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం కూడా చొరవ చూపి పారిశుద్ధ కార్మికుల కు చలి తీవ్రతలు తట్టుకునేందుకు అవసరమైన ఉన్ని దుస్తులను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అనాధలు అభాగ్యులు నిరాశ్రయుల ఆకలి తీర్చేందుకు స్వచ్ఛందంగా తమ వంతు సేవా కార్యక్రమాలతో కీలక భాగస్వామ్య పాత్ర పోషిస్తున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ సభ్యులు ఆహారం అందిస్తూ ఆకలి తీరుస్తూ ఉండడం దైవ సంకల్పంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు కూడా ప్రత్యేక దృష్టితో నెల్లూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఒక అనాధ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని కోరారు. మానవుని దైనందిన జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆహారం, గుడ్డతోపాటు అవసరమైన నివాసం (గూడు) తదితర అవసరాలను తీర్చేందుకు సహృదయులైన దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మన స్వేచ్ఛాయుత సమాజ అభివృద్ధి, మనందరి బాధ్యత అన్న సందేశాత్మక నినాదం ప్రతి ఒక్కరికి ఆశ్చర్యం కావాలని, సమాజాభ్యుదయ కార్యక్రమాల్లో మేము సైతం అంటూ ముందుకొచ్చి ముందుకొచ్చిన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీలో సహృదయులైన ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంకీ టోపీల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య యాదవ్ తో కలిసి పాల్గొన్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ సభ్యుల మానవత్వం దాతృత్వానికి ఎంతగానో సంతోషించిన పారిశుద్ధ కార్మికులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు రూరల్ మండలంలో ఇటీవల మృతి చెందిన నలుగురి కుటుంబాల వారికి మంగళవారం నిత్యాన్నదాత, శ్రీసాంబ శివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డి 10వేల రూపాయల వంతున 40వేల రూపాయలను అందజేశారు. ఆయన ఆయా గ్రామాల్లోని ఆయాకుటుంబాలవద్దకు వెళ్ళి పరామర్శించి తమవంతుగా 10వేల రూపాయలవంతున ఆర్థికసాయమందించారు. రెండేళ్ళక్రితం ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు దాదాపు ఆరేడువందలమందికి ప్రతినిత్యం ఉచితంగా అత్యంత రుచికరమైన భోజనాన్ని సమకూరుస్తున్న పరమేశ్వరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఆజన్మాంతం నిర్విరామంగా కొనసాగిస్తామని ప్రకటించి అందుకుగాను హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు 65లక్షల రూపాయలతో భవనం కూడా స్వంతనిధులతో నిర్మించారు. దాంతోపాటు ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు తమ స్వంత గడ్డపై అందించాలని ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలో ఎవరు మృతిచెందినా ఆ కుటుంబానికి 10వేలరూపాయలవంతున స్వంత నిధులు అందించేలా ఏడాదిన్నరక్రితం ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఆయన స్వంత నిధులతోనే ఒక కైలాసరథయాత్రావాహనాన్ని, నాలుగు శవశీతలపేటికలను కూడా సమకూర్చారు. నిత్యం జనాలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద, నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద తాగునీటిసరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాంతోపాటు ఆత్మకూరు పరిధిలో గిరిజనులు వివాహం చేసుకునే సమయంలో దంపతులకు నూతన దుస్తులు, వధువుకు 10వేల రూపాయలనగదు అందించేలా గిరిజన వివాహకానుక అనే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. పట్టణంలో మృతులకుటుంబాలకు ఆర్థికసాయమందించే కార్యక్రమాన్ని మండలానికి విస్తరించారు. మంగళవారం సాతానుపల్లిలోఇటీవల మృతిచెందిన జ్యోతి వెంకటమ్మకుటుంబాన్ని, గొల్లపల్లిలో ఇటీవల మృతిచెందిన ఈగా కృష్ణారెడ్డి కుటుంబాన్ని, మహిమలూరు చెందిన సూరా నరసయ్య, మహిమలూరు సుబ్బమ్మ కుటుంబాలను కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందజేశారు. కంచి పరమేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజికసేవలు అమోఘం, అత్యంత ప్రయోజనకరం, అభినందనీయం అని సర్వత్రా కొనియాడుతున్నారు. ఆర్థికసాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో టస్ట్ ప్రతినిధి మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాలలో పొలం పిలుస్తోంది

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సోమశిల, పడమటి కంభంపాడు గ్రామాల నందు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు మండల వ్యవసాయ అధికారిణి ఈ.శైలజ కుమారి వరి పొలంలో సౌరదీపపుఎరలు, లింగా కర్షకబుట్టల యొక్క ఉపయోగాలను తెలియజేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మ వారి సౌజన్యంతో పడమటి కంభంపాడు గ్రామ రైతు వర్ది బోయిన లక్ష్మీరెడ్డి పొలంలో సౌరదీపపు ఎరలు లింగా కర్షకబుట్టలను అమర్చడం జరిగింది. అదేవిధంగా రైతుల పొలాలలో జింక్ లోపం గమనించడం జరిగింది. నివారణకు జింక్ సల్ఫేట్ ఏ2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి కె.కృష్ణవేణి, వీఏఏ ఏ.జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా కాత్యాయని వ్రతం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం శ్రీ అమ్మవారికి అనివెట్టి మండపం నందు ప్రత్యేకంగా ప్రత్యేకపూల అలంకారం చేసి కాత్యాయని వ్రతం చేశారు. ఈ వ్రతం చేయుట వలన వధూవరులకు జాతక రీత్యా కుజదోషం, కాల సర్పదోషాలు అన్నీ తొలగిపోయి ఉత్తమమైన వివాహం జరగునని పండితులు తెలిపారు. స్త్రీలు సౌభాగ్యం కొరకు, ఆయురారోగ్యాల కొరకు, అన్యోన్య దాంపత్యం కొరకు ఈ యొక్క కాత్యాయని వ్రతంను చేయవచ్చును. ఈ వ్రతంను ఆచరించిన యెడల ఉత్తమమైన ఫలితాలు లభించును. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి, ఆలయ చైర్మన్ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షణలో జరిగాయి.

## అవార్డుగ్రహీత ఆర్డీవోకు అభినందన సన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అధికారిణిగా ఎంపికై జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావనిని పలువురు అభినందించారు. ఏపి యుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు, ఎల్ఆర్‌పల్లి జెడ్పి హైస్కూల్ ఎగ్జిక్యూటివ్‌కమిటీ చైర్మెన్, శ్రీరామానాట్య మండలి అధ్యక్షుడు, జిల్లా అక్రిడేషన్‌కమిటీ మెంబర్ సోమా వెంకట సుబ్బయ్య ఆర్డీవో పావనిని శాలువా, పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించారు. ఆర్డీవో పావని అత్యంత అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పి4పథకంలో ఆత్మకూరు డివిజన్‌నుండి అధికంగా మార్గదర్శకులను గుర్తించడం, పలువురు పేదలను దత్తత తీసుకునేలా చేయడం, ఉన్నతాదికారుల ఆదేశాలను శిరసామహిస్తూ అమలుచేయడంతో ఆమె ఉత్తమ సేవలను జిల్లా యంత్రాంగం గుర్తించింది. గత స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్రమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చేతులమీదుగా అప్పటి కలెక్టర్ ఓ.ఆనంద్ చేతులమీదుగా ఉత్తమ జిల్లా అవార్డు పొందిన పావని ఈదపా గణతంత్రదినోత్సవం సందర్భంగా కూడా జిల్లా ఉత్తమ అధికారిణిగా ఎంపికై జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. అచిరకాలంలోనే ఆమె అందిస్తున్న ఉత్తమసేవలకు రెఉండుదపాలు అవార్డులు రావడం విశేషం. ఆమె సేవానిరతికి, చిత్తశుద్ధికి, నిబద్దతకు నిదర్శనాలుగా అందరూ భావిస్తూ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి అవార్డు పొందాలని సోమా వెంకటసుబ్బయ్య ఆకాంక్షించారు.

## సార్వత్రికసమ్మె నోటీసు అందజేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్ణయించారు. ఈమేరకు అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్‌యూనియన్ ప్రాజెక్టుకమిటీ కార్యదర్శి పి.రాధ, సిఐటియు మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్యల ఆధ్వర్యంలో స్థానిక సిడిపివో పి.సునీలతకు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా నాగయ్య, రాధ ప్రసంగిస్తూ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి12వతేదీ దేశవ్యాపిత సమ్మెలో తాము కూడా పాల్గొంటామన్నారు. లేబర్‌కోడ్స్‌రద్దుపరచాలని, అంగన్‌వాడీల కనీసవేతనం 26వేలుగా నిర్ణయించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం ఈసమ్మె చేయనున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టుకమిటీ అధ్యక్షురాలు కె.రమణమ్మ, సెక్టారులీడర్లు కుసుమ, లావణ్య, మీనాక్షి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిష నర్ వైఓ నందన్‌ను మంగళవారం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లులతో కలిసి కమిషనర్ తో పలు సమస్యలపై మాట్లాడారు. చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్ చాంబర్లో కమీషనర్ నందన్ ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్ర స్ఫూర్తితో.. పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే కావ్య

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని యువతను చైతన్య పరిచేందుకు నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరిగి సుమారు మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి యువగళం పాదయాత్ర స్ఫూర్తితో కావలి సెల్ఫీ పాయింట్ దగ్గర నుంచి అశేష ప్రజానీకం మధ్యన కొత్తపల్లి గ్రామంలో 2000 మైలురాయి పూర్తి చేసుకున్న సందర్భంగా పైలాన్‌ను నారా లోకేష్ ఏర్పాటు చేశారు. అదే స్ఫూర్తితో మంగళవారం బయలుదేరి కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్ వరకు పాదయాత్ర చేశారు. పాదయాత్రకు ముందు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. భార్య వెంబట నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే వెంట నడిచారు. కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర పాల్గొని యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య మాట్లాడుతూ, తాను రాజకీయాల్లోకి డబ్బు కోసం రాలేదని డబ్బులు వదులుకొని ప్రజాసేవలో కోసమే రాజకీయాలకు వచ్చానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రత్యేక అనుబంధం ఉందని రాష్ట్ర



అభివృద్ధి ఆయన ధ్యేయమని అన్నారు. తన జీవితంలో ఎప్పుడు ఒంటరినని శత్రువులను కూడా ఇబ్బంది పెట్టే మనస్తత్వం తనది కాదని తెలిపారు. కావలి అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని స్వశక్తితో ఎదిగి ఈర్ష, ద్వేషాలకు దూరంగా ఉంటూ ముందు సాగుతున్నానని తెలిపారు. నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకే యువకులం పాదయాత్ర జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సర్వేంద్రియాణం నయనం ప్రధానం

- **స్మార్ట్ విజన్ కంటి వైద్య సేవలు అభినందనీయం**
- **ఐదవ డివిజన్ కార్పొరేటర్ ఒబిలి రవిచంద్ర**




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వియాని హోమ్, క్యాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారంనాడు వైకుంటపురం లోని ఎలిమెంటరీ స్కూల్ నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఐదవ డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర మాట్లాడుతూ.. మానవ శరీరంలోని ఐదు జ్ఞానేంద్రియాలలో అత్యంత ముఖ్యమైనవి కళ్ళు అని, అందుకే సర్వేంద్రియాణం నయనం ప్రధానమని అంటారని, అందమైన ప్రపంచాన్ని చూపించే నేత్రాలు దేహంలో కీలక భాగమని, కంటి ఆరోగ్యం నివారణ, నేత్రము యొక్క ప్రాధాన్యతను తెలుపుతుందని, రక్తపోటు మధుమేహం ఉన్న వారు మంచి కంటి సంరక్షణ కొరకు పోషకాహారం, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు. మారిన జీవన విధానం, పొల్యూషన్ వలన కంటి చూపు త్వరగా మందగిస్తుందని అన్నారు. కంప్యూటర్, సెల్ ఫోన్, టీవీల ప్రభావంవల్ల చిన్నారులు కూడా కంటి జబ్బుకు లోనవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కంటి అద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయడం, అర్ధరాత్రి వరకు నిద్రపోకుండా ఉండటంవల్ల కూడా కంటి జబ్బులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి సంరక్షణ కొరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, వారికి మందులు, కంటి అద్దాలు, ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. వైకుంతపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం కార్పొరేటర్ రవిచంద్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ అనుముల జయప్రకాష్, వియానిహోం సిస్టర్ రమ, పిహెచ్‌పి జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాదు, ఉప్పలపాటి రామదాసు, జి.పెంచలయ్య, ఏ.రాజశేఖర్, హాస్పిటల్స్ సిబ్బంది రాంబాబు, వెంకట్, సందీప్, నాగేశ్వరి, ఏఎన్ఎమ్ సీనమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధి లోని శ్రీ రాఘవేంద్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని బుక్కాపురంకి చెందిన బద్వేల్ హైమావతి భర్త శ్రీనివాసులు రెడ్డి(44) సోమవారం ఆ గ్రామ నివాసి అయిన కర్ణ ప్రసాద్ తోటి వింజమూరుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. వింజమూరులో వారి పనులు ముగించుకుని ప్రసాదును నీవు ఎక్కడే ఉండు నాకు కొంచెం వేరే పని ఉందని ప్రసాద్ బైకు తీసుకుని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బంగ్లా సెంటర్ వైపుకు చారని దాంతో ప్రసాదు శ్రీనివాసులు కోసం కొద్దిసేపు ఉండి వింజమూరులోనే సాయంత్రం వరకు వేచి ఉండి తిరిగి బుక్కాపురానికి వెళ్ళా డని తెలిపారు. మంగళవారం ఉదయం శ్రీ రాఘవేంద్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జీవాల కాపర్లు మోటార్ బైక్ పడి ఉండడానికి గమనించి దగ్గరకెళ్ళి చూడగా ఓటర్ బైక్ కింద వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు దాంతో సమాచారం ఇచ్చారు. కలిగిరి సీఐ వెంకట్ నారాయణ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంకటనారాయణ మృతదేహాన్ని గుంటలో నుండి పైకి లేపి మోటార్ బైకును పక్కనపెట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు తరలించారు మృతికి కారణాలు తెలియవలసి ఉంది. మృతునకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జెఎల్ఎంల రివర్షన్‌కు వ్యతిరేకంగా ధర్నా




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్‌శాఖలో జె.ఎల్.ఎంలుగా పనిచేస్తున్న వారిని రివర్షన్‌చేసి ఏజెఎల్ఎంలుగా నియమించేలా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆత్మకూరులో మంగళవారం సిఐటియు, యుఈఈయుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ఎదుట వారంతా బైఠాయించి ధర్నా చేశారు. ఈఈ భానునాయక్, ఏడియి చిన్నస్వామి నాయక్‌లకు సిఐటియు, యుఈఈయు సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. అందరినీ జెఎల్ఎంలుగానే కొనసాగించాలని వారు నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు జి.వి.శివ ప్రసాద్, కొండమూరు హజరత్తయ్య తదితరులు ప్రసంగించారు. 2019లో వేలాదిమంది కార్మికులను గ్రేడ్2 జూనియర్‌లైన్‌మ్యాన్‌లుగా నియమించుకున్నారని, ఐదేళ్ళు సేవలందించిన గ్రేడ్2లను జూనియర్‌లైన్‌మెన్‌లుగా మార్చుతూ ఉత్తర్వులిచ్చారని, కానీ ఏదో కారణంతో వారిని మళ్లీ గ్రేడ్2లుగా రివర్షన్ ఇస్తుండడం అన్యాయమన్నారు. తగిన విద్యార్హతలతో నిబంధనలమేరకు వారి నియామకం జరిగిందని, అలాంటి వారికి రివర్సన్ ఇవ్వడం సమంజసంగా లేదని, ప్రభుత్వం వెంటనే పునరాలోచించి కోర్టులో పెండింగ్‌ను క్లియర్ చేయించి అందరినీ జెఎస్ఎంలుగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు, యుఈఈయు నాయకులు, జెఎల్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో దోమల దండయాత్ర



**నెల్లూరు సిటీ, మేజర్ న్యూస్ :** నెల్లూరులో దోమల వృద్ధి ఎక్కువగా ఉంది. దోమకాటుతో ప్రజలు ప్రశాంతంగా ఉండ లేకపోతున్నారు. దోమల నివారణకు అధికారులు విస్తృత చర్యలు చేపట్టాలని బిజెపి నేతలు నెల్లూరు డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమలు నెల్లూరులో గ్రామాలలో గుంపులు గుంపులుగా ప్రజలను కుడుతున్నాయి. నీటి నిల్వ ప్రదేశాలలోను మురికి కాలువలలోను ఆయిల్ బాల్స్ వదలడంలో తీవ్ర జాప్యత నెలకొంది. లేదు. దోమకాటు ఉపశమనానికి కాయిల్స్ కడ్డీలు రసాయనాలు పనిచేయడం లేదు. ప్రత్యేకించి ఈ సంవత్సరం దోమలు కుడితే ఒంటి మీద దద్దుర్లు జిలలు వస్తున్నాయి. దోమల వలనప్రజలు ఎవరు సుఖంగా నిద్రించే పరిస్థితులు లేవు. సాయంకాలమైతే బహిరంగ ప్రదేశాలలోనూ ప్రజలు తిరుగులేకున్నారు. దోమ కాటు వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమలు వృద్ధి చెందకుండా అధిక మోతాదులో ఆయిల్ బాల్స్ ను ఒకే సమయంలో విడుదల చేయాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని దోమల నిర్మూలనకు తక్షణమే చర్యలు చేపట్టాలని బిజెపి నేతలు ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, విజయ్ శ్రీ, రఘురామయ్య, నారాయణ యాదవ్, టీ శ్రీనివాసులు, కళ్ళు భాస్కర్, సునీల్ రెడ్డి, ముజీబ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దామిశెట్టి కుటుంబ సభ్యుల పరామర్శించిన బాలభాస్కర్



**కావలి, మేజర్‌న్యూస్ :** డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుధీర్ నాయుడు తండ్రి దామిశెట్టి శ్రీనివాస్ నాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్సి అధికారి బాలభాస్కర్ వారి గృహానికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాల భాస్కర్ మాట్లాడుతూ.. తండ్రి ప్రేమ త్యాగం వెలకెట్టలేనివి కుటుంబం కోసం తన సంతోషాలను సైతం త్యాగం చేస్తూ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడే నాన్న ఏ చిన్న కష్టం వచ్చినా కొడుకు కూతురుకి వెన్నుదన్నుగా నిలుస్తారు. తండ్రి మౌనం వెనుక సముద్రమంత ప్రేమ ఉంటుందని ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ కావలి పట్టడానికి తీరని లోటుగా మిగిలిపోతాయని వారు స్పష్టం చేశారు. దానిశెట్టి శ్రీనివాస నాయుడు ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి విద్యారంగానికి ఎన్నో లేని సేవలు అందించారని, రాజకీయంగా అనేక ఉన్నత పదవులు అధిరోహించి, ఆ పదవులకే గౌరవాన్ని తెచ్చిన వ్యక్తిని సుదీర్‌కు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఆస్తి పన్ను వసూలు పూర్తి చేయాలి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక నాలుగో మైలు ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న ఒక ఖాళీ స్థలానికి సంబంధించి పన్ను బకాయలు సుమారు 5 లక్షల రూపాయలు ఉండటంతో స్థల యజమానితో కమిషనర్ నేరుగా మాట్లాడారు. నగరాభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు పన్నుల వసూళ్లు కీలకమని వారికి వివరించారు. నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగస్వాములు అయ్యేందుకు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కమిషనర్ వారికి సూచించారు. అనంతరం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో కమీషనర్ మాట్లాడుతూ.. ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులను నిర్దేశించిన సమయంలోపు 100 శాతం వసూలు చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు రవి, చినబాబు, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమాలే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి పథకంలోనూ పారదర్శకతకు పెద్దపీట
- పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేత
- కిసాన్ సెజ్ వద్ద 132 కెవి విద్యుత్ స్టేషన్ మంజూరు
- ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్





**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి సంక్షేమాలను పారదర్శకంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుని అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యచరణ అమలుతో ముందుకు సాగుతుందని ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి కోవూరు నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో ప్రజల నిత్యవసరాల్లో భాగమైన విద్యుత్ శాఖ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. కుల మత ప్రాంతం పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను దరి చేర్చాలన్న ప్రధాన అజెండాతో ముఖ్యమంత్రిని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. నెల్లూరు లోని కిసాన్ సేజ్ వద్ద 132 కెవి సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నామని, త్వరలోనే నిర్మాణపు పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర ఇంధన వనరుల శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇది కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న రెడ్డిపాలెం మండలం పశీచేడు గ్రామపంచాయతీలో సుమారు రూ 3.30 వ్యయంతో ఏర్పాటు చేసిన 32 /11 కెవి సబ్ స్టేషన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో మరో సబ్ స్టేషన్‌ను రూ.3కోట్లపై చిలుకు వ్యయంతో ప్రారంభిస్తున్నామని, అదేవిధంగా మరో రూ.4కోట్ల వ్యయంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆర్‌డిఎస్ఎస్ పథకం ద్వారా అనేక పనులు చేపట్టడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలను గాడిలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖలో రూ.30వేలకోట్ల నష్టం వాటిల్లిందని, జరిగిన నష్టాన్ని దశలవారీగా భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజులలో యూనిట్ కాస్టును రూ.1.19 పైసలు తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే విద్యుత్ శాఖ యొక్క ముఖ్య లక్ష్యం అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మూడు డిస్కమ్‌లు పనిచేస్తున్నాయని, అందులో ఒకటి తిరుపతి, రెండవది విజయవాడ, మూడవది విశాఖపట్నంలో ఉన్నాయన్నారు. అయితే విశాఖలో డిస్కం మీద అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, అది వాస్తవ విరుద్ధమని ఆయన ఖండించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి సుమారు 500 నుంచి 600 కోట్ల రూపాయలు మేర విద్యుత్ బకాయిలు ఉన్నట్లు ఆయన తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు రూ.13వేల కోట్లు అందించడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది చొరవతో ట్రూ డౌన్ చార్జీలను తగ్గించామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రూ.33వేల కోట్ల మేర సామాజిక పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 16,300 ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు మెగా డీఎస్సీ ద్వారా నియమించడం జరిగిందన్నారు. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మ బడి ద్వారా చదువుకున్న పిల్లలు తల్లిదండ్రులకు నగదు వంటి అనేక కార్యక్రమాలు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా అన్నిటిని నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు కల్పన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. పోలీసు శాఖలో 6000 ఉద్యోగాల నియామకాన్ని చేపట్టామన్నారు. విద్యుత్ శాఖలో కూడా అసిస్టెంట్ ఇంజనీర్ల కొరత ఉందని, రానున్న రోజుల్లో ముఖ్యమంత్రితో చర్చించి 500 ఏఈ పోస్టును భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో నెల్లూరులో మరో 10 నుంచి 12 విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్తును అందజేయడంతోపాటు లో వోల్టేజ్ సమస్యను అధిగమించడం జరుగుతుందన్నారు. రైతులందరిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభం శుభపరిణామం

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మంగళవారం కోవూరు నియోజకవర్గంలో 33 కెవి విద్యుత్ సబ్ స్టే షన్లు విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ చేతుల మీద ప్రారంభించుకోవడం పరిణామమని ఆయన తెలిపారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోవూరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటారని, ఆమె కృషిని గుర్తించాలని ఆయన కోరారు. నిత్యం ప్రజా సంక్షేమం కొరకు పరితపించే ఎమ్మెల్యే కోవూరుకు ఉండడం గొప్ప వరమన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రవికుమార్‌కు ప్రతిష్టాత్మకమైన విద్యుత్ శాఖను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కేటాయించారన్నారు. విద్యుత్ శాఖకు సరైన వ్యక్తి అని కొనియాడారు.



## రూ 10 కోట్ల వ్యయంతో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. కోవూరు నియోజకవర్గంలో రూ.10కోట్ల వ్యయంతో రెండు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు ప్రారంభోత్సవాలు, డిజి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. సబ్ స్టేషన్‌లో ఏర్పాటులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుల సమస్యలను గుర్తించి విద్యుత్ చార్జీలను రూ.1.50 పైసలు తగ్గించడం జరిగిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో రూ.93.30 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ఐదు మండలాలలో రైతులకు ఉపయోగపడే విధంగా కల్లాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిసాన్ సేజ్ వద్ద 132 కెవి విద్యుత్ చేసిన ఏర్పాటుకు మంత్రిని ఈ సందర్భంగా కోరారు. అనంతరం నెల్లూరు నగర ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ మాట్లాడుతూ.. మంగళవారం రూ.3.5కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్‌ను ప్రారంభించుకునే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్థానికులు ఇబ్బందులను గుర్తించి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని ఆయన తెలిపారు. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరు ప్రజలు అదృష్టవంతులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాలెం మున్సిపల్ చైర్ పర్సన్ సుప్రజ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రాఘవేంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ చౌదరి, అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది తోపాటు స్థానిక నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెట్ట ప్రాంత అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు కృషి : కలెక్టర్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఒక ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతుందని వెనుకబడి ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో నిరుద్యోగతను తగ్గించి ఆర్థిక పరిపుష్టిని సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని దుత్తలూరులో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ముగించుకొని వింజమూరుకు వస్తు మార్గమధ్యంలో నందిగుంట గ్రామంలో గోకుల షెడ్లను పరిశీలించారు. తరువాత వింజమూరులోని చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర నిర్వహణ పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు సంపద కేంద్రంలో తయారు చేస్తున్న వర్మి కంపోస్ట్ ఎరువును ఇతర ప్రాంతాలకు కూడా పంపడం పట్ల కార్యదర్శి రామారావును, ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు ప్రాంతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతు సాగు చేస్తున్న నిమ్మ తోటను పరిశీలించారు. రైతును పలు విషయాలను అడిగి ప్రభుత్వ పథకాలను గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నియోజకవర్గంలో ఉత్పాదకర శక్తి ఎక్కువగా ఉందని దాని సద్వినియోపరుచుకునే విధంగా రైతులకు బిందు సేద్యం పరికరాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీనివలన ఉద్యాన పంటల సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొనితక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే విధంగా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా గొర్రెలు మేకలు యూనిట్లను అందజేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రోత్సాహన్ని అందిస్తామన్నారు ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ప్రోత్సాహానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నిస్తామన్నారు ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు స్థానికులకు అధికంగా లభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్.సుజనా మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి పాములపాటి మాల్యాద్రి దుద్దిగుంట శ్రీనివాసులు రెడ్డిలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ డిపిఓ వసుమతి సీఈఓ శ్రీధర్ రెడ్డి మృదుల ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు పట్టణాధ్యక్షుడు గురజాల గోపి కాటం రమణారెడ్డి ఎనపల్లి పెంచలరావు ఎన్.రాయుడు తదితరులు ఉన్నారు.



# ఉచిత ఇసుక పచ్చి బూటకం..



- మీడియాతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజం
- ప్రభుత్వ ధర కన్నా.. 5 రెట్లకు పైగా అధిక వసూలు చేస్తూ దోచుకుంటున్న కూటమి నాయకులు
- ఆధారాలతో చూపిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఆర్భాటంగా ప్రచారం చేసుకునే ఉచిత ఇసుక హామీ పెద్ద బూటకమని, ఆ పేరుతో కూటమి నాయకులు సహజ వనరులను దోచుకుని జేబులు నింపుకుంటున్నారని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా 5 రెట్లకు పైగా అధిక ధరలు వసూలు చేస్తూ ఒక్కో ఇసుక రీచ్ నుంచి కూటమి ఎమ్మెల్యేలు నెలకు రూ.3 కోట్లకు పైగా దోచుకుంటున్నారని ఆరోపించారు. విరువూరు ఇసుక రీచ్‌పై సమగ్ర పరిశీలన తర్వాతే మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. నిబంధనలను బేఖాతర్ చేస్తూ విరువూరు ఇసుక రీచ్‌లో అర్ధరాత్రి, వేకువ జామున ఇసుక తవ్వి తరలిస్తున్న ఫొటోలను ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రదర్శించారు. ఇసుక అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా ఎలా దోచేస్తున్నదీ ఆయన వివరించారు. సీఎం చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న ఇలాంటి వారికి బేడీలు వేసి నడిరోడ్డుపై నడిపించి తీసుకెళ్లాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇసుకను అక్రమంగా దోచుకుంటున్న వారు దొరికితే అరెస్ట్ చేసి శిక్షించాల్సిన పోలీసులు మంత్రి పర్మిషన్ అడగడం ఏమిటని మండిపడ్డారు. పైగా కూటమి నాయకుల ఇసుక దందాను బయటపెట్టడానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం చూస్తుంటే కూటమి నాయకుల దందాకు కలెక్టర్, ఎస్పీ లైసెన్స్ ఇచ్చినట్లుగా ఉందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రెస్‌మీట్‌లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే..

### పెన్నా నదికి గర్భశోకం:

అధికార పార్టీ నాయకుల ధన దాహానికి సహజ వనరులు అడుగంటిపోతున్నాయి. నెల్లూరులో పెన్నా నదీ గర్భం శోకంతో అల్లాడిపోతుంది. ఉచిత ఇసుక పేరుతో స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు. నదీగర్భంలోనే రోడ్లు నిర్మించి భారీ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వి లారీలతో తరలిస్తున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా పెన్నా నదిలో 10 మీటర్ల లోతు వరకు ఇసుకను తవ్వి టిప్పర్లు, లారీలతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు పొక్లెయినర్లకు అనుమతి లేదని తెలిసినా నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను తరలించడమే కాకుండా, ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఐదు రెట్లు అధిక ధరలకు ఇసుకను అమ్మేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక టెండర్లు నిర్వహించి ఏడాదికి రూ.750 కోట్ల చొప్పున అయిదేళ్లలో సుమారు 3500 కోట్ల ఆదాయం తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పేరుతో ఆ మొత్తాన్ని కూటమి నాయకులు దోచుకుంటున్నారు.

### రాత్రింబవళ్లూ ఇసుక దోపిడీ :

ఒక్క సూరాయపాలెం ఇసుక రీచ్ ద్వారానే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూ.100 కోట్లు దోపిడీకి స్కెచ్ వేశారని గతంలో నేను ఆరోపిస్తే, ఆయన తోసిపుచ్చారు. కానీ, ఆయన ఇప్పుడు ఏకంగా సాయి శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన బ్యాంక్ అకౌంట్‌కి వెళ్లేలా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి నేరుగా కోట్లు కొల్లగొడుతున్నారు. ఇసుక కొనుగోలు చేసిన వారికి ట్రిప్ షీట్ పేరుతో చేత్తో రాసిన స్లిప్ చేతిలో పెట్టి పంపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం నాలుగున్నర టన్నులు లోడ్‌తో వెళ్లే ఒక ట్రాక్టర్‌కి టన్నుకి రూ.68 చొప్పున రూ.300 వసూలు చేయాల్సి ఉంటే ఐదు రెట్లు అధికంగా రూ.1,250 వసూలు చేస్తున్నాడు. పైగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ రేయింబవళ్లు పొక్లెయినర్లతో తోడేస్తున్నారంటూ.. పెన్నా నదిలో విరువూరు ఇసుక రీచ్‌లో వేకువజామున, అర్ధరాత్రి వేళల్లో ఇసుక తవ్వుతున్న ఫొటోలు ప్రదర్శించారు. ఓపెన్ రీచ్‌లలో ఏకంగా రైతులకు సాగు నీరు వెళ్లే కాలువలకు అడ్డంగా గట్టు కట్టి మరీ గ్రావెల్‌తో రోడ్డేసి ఇసుక లారీలను రప్పిస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను బేఖాతరు చేసి మరీ విచ్చలవిడిగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో పడి అమాయకుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు నాయుడికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇసుక దోపిడీకి పాల్పడుతున్న వారిని నడిరోడ్డు మీద బేడీలు వేసి నడిపించాలి.

### 5 రెట్లకు మించి అధిక ధరలు:

విరువూరు ఇసుక రీచ్‌ను కేస్ స్టడీగా తీసుకుని తెలుగుదేశం నాయకుల ఇసుక దోపిడీపై మేం కూలంకషంగా స్టడీ చేశాం. ఇసుక రీచ్ మీద నెలకు ఏకంగా రూ.3 కోట్లు దోచేస్తున్నారు. రూ.1400 వసూలు చేయాల్సిన టిప్పర్‌కి ఏకంగా రూ.8 వేలు వసూలు చేస్తున్నారు. 12 టైర్ల లారీకి రూ.1600 వసూలు చేయాల్సి ఉంటే రూ.12 వేలు, 14 టైర్ల లారీకి రూ.2024 వసూలు చేయాల్సి ఉంటే రూ.15 వేలు వసూలు చేస్తున్నారు.

### ఇసుక దోపిడీదారులకు పోలీసుల రక్షణ !

కూటమి నాయకుల ఇసుక దోపిడీని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. పోలీసులకే కమీషన్లు ఇస్తున్నామని వారు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఈ ఇసుక దోపిడీని పోలీసులు తన దృష్టికి తీసుకొచ్చారని మంత్రి నారాయణ సైతం చెబుతూ నిందితులపై చర్యలు తీసుకోమని ఆదేశించకుండా, రాత్రుళ్లు టిప్పర్లతో కాకుండా ట్రాక్టర్లతో తరలించుకోమని ఉచిత సలహాలిస్తున్నారంటూ.. మంత్రి మాటల ఆడియోను ప్రెస్‌మీట్‌లో వినిపించారు. ఇసుక దొంగలు చేతికి దొరికితే వారిని అరెస్ట్ చేయకుండా మంత్రి నారాయణ సలహా అడగడం చూస్తుంటే పోలీసులు ఎవరి కోసం పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు న్యాయబద్ధంగా నిబంధనల మేరకు వ్యవహరించడం లేదు. కూటమి నాయకుల ఇసుక దోపిడీని ప్రజలకు చూపించడానికి వైయస్సార్సీపీ ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకుంటున్నారంటే, కూటమి నాయకుల ఇసుక దోపిడీకి కలెక్టర్, ఎస్పీలు లైసెన్స్ ఇచ్చారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్షేపించారు.



## లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోకి సూర్యకిరణాలు

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండలంలోని లక్ష్మీ నరసింహపురం గ్రామంలో కొలువైన నరసింహస్వామి దేవాలయంలోకి సూర్య భగవానుడు కిరణాలు తాగుతున్నాయి. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రథసప్తమి రోజు నుండి భీష్మ ఏకాదశి 29వ తేదీ వరకు సూర్య భగవానుని కిరణాలు నేరుగా స్వామివారి ముఖం మీద నుండి పాదాల వరకు పడతాయి. ఐదు రోజులు మాత్రమే ఈ అద్భుతం జరుగుతుంది. అరుదైన ఈ దృశ్యాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు లక్ష్మీనరసాపురం దేవాలయానికి విచ్చేస్తున్నారు. బుధవారం కూడా ఉంటుందని, దర్శించాలనుకున్న భక్తులు ఉదయం 7 గంటలకు స్వామి వారి దేవాలయానికి విచ్చేసి దర్శించుకుని స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని ధర్మకర్తలు తెలిపారు.



## ప్రభుత్వ థర్మల్ కేంద్రంలో ఐసోలేటర్ దగ్ధం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**

మండలంలోని నేలటూరు గ్రామం ప్రాంతాన రాష్ట్ర ప్రభుత్వ ఏపీ జెన్కో థర్మల్ కేంద్రంలో మంగళవారం రాత్రి ప్రమాదం జరిగింది . ఈ ప్రమాదంలో ఐసోలేటర్ దగ్ధమైనట్లు సమాచారంగా ఉంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతంలోని రెండవ యూనిట్లో స్విచ్ యార్డులో సాంకేతిక కారణంగా ప్రమాదం జరిగిందని థర్మల్ విద్యుత్ కేంద్రం అధికారులు తెలిపారు. రెండవ యూనిట్లో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా నివారణ చర్యలు తీసుకుందామని ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీరు జగన్నాథం తెలిపారు.

